సాక్షి
జోగులాంబ గద్వాల

బుధవారం । 2 । జూలై । 2025



మేము చెప్పినోళ్లకే అడ్మిషన్

మేం చెప్పినోళ్లకే అడ్మిషన్ ఇవ్వాలని మరికల్ కేజీబీవీ ఎస్‌ఓపై ఒత్తిడి తెస్తున్నారు.

వివరాలు 8లో ▸



జూరాలకు తగ్గిన ఇన్‌ఫ్లో

ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టుకు ఎగువ నుంచి వస్తున్న ఇన్‌ఫ్లో స్వల్పంగా తగ్గింది.

వివరాలు 8లో ▸

వాతావరణం

గరిష్ఠం/కనిష్ఠం
34.6 /23.3

రోజంతా ఆకాశం మేఘావృతమై ఉంటుంది. చల్లని గాలులు వీస్తాయి. ఓ మోస్తారు వర్షం కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

కార్మిక ఉద్యమ చరిత్రలో సముచిత స్థానం

గద్వాల న్యూటౌన్: భారత కార్మికోద్యమ చరిత్రలో ఆల్ ఇండియా ఇన్సూరెన్స్ ఎంప్లాయిస్ అసోసియేషన్ (ఏఐఐఈఏ) సముచిత స్థానాన్ని దక్కించుకుందని గద్వాల బ్రాంచ్ ప్రధాన కార్యదర్శి బంగి రంగారావు అన్నారు. మంగళవారం స్థానిక ఎల్‌ఐసీ కార్యాలయంలో ఏఐఐఈఏ ఆవిర్భావ దినోత్సవాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కఠినమైన పరిస్థితుల మధ్య ఏఐఐఈఏ ఆవిర్భవించి, విశాలమైన ప్రయోజనాలను సాధించిందని చెప్పారు. 74 ఏళ్ల అప్రతిహాస ప్రయాణాన్ని పూర్తి చేసుకొని, ప్లాటినం జూబ్లీ వసంతంలోకి అడుగుపెట్టిందన్నారు. ఎల్‌ఐసీ జాతీయాకరణకు కారణమవడమే కాకుండా ఎల్‌ఐసీ అద్భుత పురోగతి, అభివృద్ధికి చోదక సాధనంగా ఉపయోగపడిందన్నారు. దేశంలోని ఇన్సూరెన్స్ రంగంలో ప్రైవేట్ ప్రాబల్యం ఉండకూడదు అన్న నినాదాన్ని అహర్నిశలు ప్రచారం చేస్తూనే వస్తోందన్నారు. ఎల్‌ఐసీ ఉద్యోగుల సంక్షేమం, సమస్యల పరిష్కారం కోసం అహర్నిషలు ఏఐఐఈఏ కృషి చేస్తోందన్నారు. అంతకుముందు అసోసియేషన్ జెండాను అధ్యక్షుడు వంటి సూరజ్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో క్లాస్ 3, క్లాస్ 2 , క్లాస్ వన్ ఉద్యోగులు, ఏజెంట్లు పాల్గొన్నారు.

మామిడి సాగులో కొమ్మ కత్తిరింపులు కీలకం

గద్వాల వ్యవసాయం: మామిడి సాగులో కొమ్మ కత్తిరింపులు కీలకమని, దీనికి జూన్, జులై నెలలు అనువైనవని జిల్లా ఉద్యానశాఖ అధికారి అక్బర్ పాష ఒక ప్రకటనలో సూచించారు. మామిడి పంట సమృద్ధిగా పండాలంటే ప్రతి ఏడాది మామిడి కోత అనంతరం చెట్టుకు 15 రోజులు విశ్రాంతి ఇచ్చి, కొమ్మలు కత్తిరించాలని, ఇలా చేయడం వల్ల చెట్టు లోపలికి గాలి, వెలుతురు, సూర్యరశ్మి సోకి మంచి కాపు వస్తుందని తెలిపారు. చెట్ల నుంచి కాయలు కోసిన తర్వాత మిగిలిన తొడమలను కత్తిరించాలని, ఎండు, చీడపీడలు ఆశించిన కొమ్మలను మొదటి వరకు కత్తిరించి కొనలకు బోర్డో మిశ్రమాన్ని లేదా కాపర్ యాక్సిక్లోరైడ్‌ను పూయాలని తెలిపారు.

అథ్లెటిక్స్ ఎంపిక పోటీలు



గద్వాలటౌన్: రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీల కోసం మంగళవారం స్థానిక ఇండోర్ స్టేడియంలో జిల్లాస్థాయి ఎంపిక పోటీలు జరిగాయి. బాలుర, బాలికలకు పరుగు పందెంతో పాటు లాంగ్‌జంప్, హైజంప్, షాట్‌పుట్, జావలిన్‌త్రో విభాగాలలో 350 మంది విద్యార్థులు పోటీపడ్డారు. డీవైఎస్‌ఓ జితేందర్ జెండా ఊపి పోటీలను ప్రారంభించారు.

వేరుశనగ క్వింటా రూ.5,752

గద్వాల వ్యవసాయం: గద్వాల మార్కెట్‌కు 660 క్వింటాళ్ల వేరుశనగ రాగా, గరిష్ఠం రూ.5,752 కనిష్ఠం రూ.3,229 ధరలు పలికాయి.

రాజకీయ రచ్చ..!

'జూరాల'పై మాటల తూటాలు	అధికార, విపక్ష నేతల పరస్పర విమర్శలు	మంత్రి ఉత్తమ్ ప్రాజెక్ట్ సేఫ్ వ్యాఖ్యలపై దుమారం	రోప్ తెగలేదని అయినా.. రిపేర్లు చేస్తున్నామన్న అధికారులు	ఎవరి వాదన వారిదే.. అసలు డ్యాం భద్రత ఏ మేరకు?

జూరాల ప్రాజెక్ట్ రోప్‌లు తెగిపోవడం కాంగ్రెస్ ప్రభుత్వ నిర్లక్ష్యానికి నిదర్శనం. వరద వస్తుందని తెలిసినా.. ప్రాజెక్ట్ వద్ద స్పిల్‌వే గేట్ల మెయింటెనెన్స్ పనులు చేయించడంలో విఫలమైంది. ప్రభుత్వం చేతగానితనం వల్లే ఇలా జరిగింది. ప్రాజెక్ట్ భద్రతపై సమీక్ష చేయాలి. బాధ్యులపై చర్యలు తీసుకోవాలి. రైతులకు, ప్రాజెక్ట్‌కు ఇబ్బందులు కలగకుండా చూడాలి.

– మాజీ మంత్రులు శ్రీనివాస్‌గౌడ్, లక్ష్మారెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు ఆల, చిట్టెం

పదేళ్ల బీఆర్‌ఎస్ పాలనలో ఇరిగేషన్ శాఖ భ్రష్టుపట్టింది. ప్రాజెక్ట్‌ల కనీస మెయింటెనెన్స్‌ను మరిచారు. పేరుకుపోయిన మట్టి, ఇసుక ఇతరత్రా పూడికను కూడా తీయలేదు. మేం అధికారంలోకి వచ్చాక క్రమం తప్పకుండా నిర్వహించాల్సిన మరమ్మతులపై దృష్టిపెట్టాం. పలు రకాల పూడికను తీసేందుకు కార్యాచరణ రూపొందిస్తున్నాం. ప్రస్తుతం జూరాల ప్రాజెక్ట్ రోప్‌లు తెగిపోలేదు. అంతా భద్రంగానే ఉంది.

– ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, రాష్ట్ర నీటి పారుదల శాఖ మంత్రి

జూరాల డ్యాం సేఫ్‌గా ఉందనడం పచ్చి అబద్ధం. రెండు సైడ్‌లు గ్యాలరీలోకి దిగడానికి ఉన్న రెండు లిఫ్ట్‌లు పనిచేయక ఎనిమిదేళ్లయింది. అవి పని చేయనందుకు ఆ గ్యాలరీలో నడవడానికి వీలు కాదు. పరిశీలించడానికి వెళ్లే ఆస్కారం లేదు. భారీగా సిల్ట్ పేరుకుపోవడంతో లోన బరువు ఎక్కువై గోడలు వ్యాకోచించాయి. నీరు బయటకు వచ్చేటప్పుడు ఫౌండేషన్‌లోకి వెళ్ల కర్టెయిన్ వాల్ కింద రంధ్రాలు పడ్డాయి. ఇది పాజెక్ట్‌కు అత్యంత ప్రమాదకరం.

– డీకే భరతసింహారెడ్డి, గద్వాల మాజీ ఎమ్మెల్యే

రోప్‌లు తెగిపోయాయనేది అసత్య ప్రచారం. రోప్స్ ఫిట్టింగ్ మాత్రమే ఊడిపోయింది. డ్యాం సేఫ్ కాదు అని మాజీ ఎమ్మెల్యే మాట్లాడుతున్నారు. పరిష్కార మార్గాలపై సూచనలు చేయాలి తప్ప.. ప్రజలను భయభ్రాంతులకు గురిచేసేలా ఆయన మాట్లాడడం సరికాదు. గ్యాలరీలోకి పోలేని పరిస్థితి అనేది కరెక్ట్ కాదు (అధికారి వెళ్లిన ఫొటోను ప్రదర్శిస్తూ). లిఫ్ట్ పనిచేయడం లేదనేది మాత్రమే వాస్తవం. ప్రాజెక్ట్‌కు ఎలాంటి ధోకా లేదు.

– బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి, గద్వాల ఎమ్మెల్యే

..వెనుకబడిన పాలమూరు జిల్లాలో ప్రత్యక్షంగా, పరోక్షంగా ఏడు లక్షల ఎకరాలకు సాగునీరందిస్తూ వరప్రదాయినిగా నిలిచిన ఇందిర ప్రియదర్శిని జూరాల ప్రాజెక్ట్‌కు సంబంధించి అధికార, విపక్ష నేతల మధ్య మాటల మంటలకు ఇవి నిదర్శనం. ఇటీవల రోప్ తెగగా.. ప్రాజెక్ట్ భద్రతపై రాజకీయ దుమారం చెలరేగుతోంది. అంతేకాకుండా అధికార నేతలు, అధికారుల వైరుధ్య ప్రకటనలతో ప్రజలు అయోమయానికి గురవుతున్నారు. – సాక్షి ప్రతినిధి, మహబూబ్‌నగర్



ఇప్పటి వరకు 28, 41, 45, 51 గేట్ల రోప్‌లు మార్చి మరమ్మతులు చేశారు. ఇంకా 8, 12, 19, 27 గేట్ల మరమ్మతులు చేయాల్సి ఉంది. తాజాగా 31, 25, 21, 12, 8, 4 గేట్ల రోప్‌లు తెగిపోయాయి. ఇందులో కొన్ని గేట్లు రెండు వైపులా తెగిపోగా.. మిగిలినవి ఒక పక్క తెగిపోయాయి.

లీకైన గేట్లకు లేని ప్రతిపాదనలు..

ప్రస్తుతం కొన్ని గేట్ల నుంచి నీళ్లు లీకవుతున్నాయి. వీటి మరమ్మతుల కోసం గతంలో అధికారులు ప్రతిపాదనలు కూడా చేయకపోవడం విమర్శలకు తావిస్తోంది. అధికారులు విధుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి.

3 ఏళ్ల క్రితం రూ.12.50 కోట్లతో ప్రతిపాదనలు..

మరమ్మతుల కోసం అధికారులు ఏటేటా ప్రతిపాదనలు పంపినా.. పట్టింపు లేకుండాపోయింది. చివరకు నీటిపారుదల శాఖ అధికారులు రెండు కమిటీలను వేసి మరమ్మతులపై అధ్యయనం చేయించారు. ఆ తర్వాత మరమ్మతులకు రూ.12.50 కోట్లు అవసరమని ప్రతిపాదన చేయగా.. మూడేళ్ల క్రితం ప్రభుత్వం రూ.11 కోట్లు కేటాయించింది. ప్రాజెక్ట్‌లోని ఎనిమిది గేట్ల రోప్‌లు అత్యవసరంగా మార్చాలని భావించగా.. వీటి కోసం ఫిబ్రవరి నెలలో రూ.కోటి మంజూరు చేశారు. ఎట్టకేలకు పనులు ప్రారంభమైనా.. పురోగతి అంతంత మాత్రంగానే ఉండడంతో అధికారులపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

వైరుధ్య మాటలతో ఆందోళన..

జూరాల ప్రాజెక్ట్‌కు సంబంధించి రోప్‌లు తెగలేదని ఇటీవల పర్యటనలో మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. ప్రాజెక్ట్ బ్రిడ్జిపై పరిమితికి మించి వాహనాలు లోడ్‌తో వెళ్లడం ప్రమాదమని.. ఈ మేరకు దీనికి ప్రత్యామ్నాయంగా మరో కొత్త బ్రిడ్జి నిర్మించేందుకు రూ.100 కోట్లు మంజూరు చేస్తున్నట్లు వెల్లడించారు. గ్యాంటీ క్రేన్‌ను కొత్తగా ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. అందులో భాగంగా మంగళవారం లోయర్ జూరాలలో కృష్ణానదిపై హైలెవల్ రోడ్డు బ్రిడ్జి నిర్మాణం చేపట్టేందుకు రూ.121.92 కోట్లు మంజూరు చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఇంత వరకు బాగానే ఉన్నా.. మంత్రి రోప్‌లు తెగలేదని చెప్పడం .. జోగుళాంబ గద్వాల జిల్లా సాగునీటి పారుదల శాఖ ఎస్‌ఈ రహీమొద్దీన్ 'ఎనిమిదింటిలో నాలుగింటి రోప్‌లు సరి చేశాం. ముందస్తుగా వరద రావడం ఆటంకంగా మారింది. ప్రస్తుతం ప్రాజెక్ట్‌కు వచ్చిన ముప్పు ఏమీ లేదు. మరమ్మతులు జరుగుతున్నాయి.' అని చెప్పడంపై విమర్శలకు తావిస్తోంది. ఈ క్రమంలో రాజకీయ రచ్చ నెలకొనగా.. ప్రాజెక్ట్ పరిసర ప్రాంత ప్రజలతో పాటు ఉమ్మడి జిల్లా రైతాంగంలో ఆందోళన వ్యక్తమవుతోంది.

2019లో వెలుగులోకి..

కృష్ణా బేసిన్‌లో తెలంగాణ ముఖద్వారం ఇందిరా ప్రియదర్శిని జూరాల ప్రాజెక్ట్.. అత్యంత వెనుకబడిన ప్రాంతమైన పాలమూరు జిల్లా వరప్రదాయినిగా నిలుస్తూ గడిచిన మూడు దశాబ్దాలుగా ఇక్కడి ప్రజల తాగు, సాగునీటి అవసరాలు తీరుస్తోంది. 1996లో జూరాల ప్రాజెక్ట్ అందుబాటులోకి వచ్చింది. ప్రాజెక్ట్‌కు మొత్తం 62 రేడియల్ గేట్లు ఉండగా.. 2019లో గేట్లు తుప్పు పట్టిన విషయం వెలుగులోకి వచ్చింది.

రేపు వాహనాల వేలం

గద్వాల క్రైం: ఎక్సైజ్ నేరాల్లో పట్టుబడిన వాహనాలను ఈ నెల 3వ తేదీన బహిరంగ వేలం నిర్వహించనున్నట్లు ఎక్సైజ్ సీఐ గణపతిరెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. స్కార్పియో, రెండు బైక్‌లను వేలంలో విక్రయించేందుకు ప్రభుత్వం నుంచి ఆదేశాలు అందాయని, ఆసక్తి ఉన్న వ్యక్తులు రూ.5వేలు డిపాజిట్ చేసి పాల్గొనాలని, ఉదయం 10గంటలకు ఎక్సైజ్ కార్యాలయంలో వేలం నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు.

గట్టు.. ముందడుగు



గట్టులో అంగన్‌వాడీ కేంద్రంలో వివరాలు తెలుసుకుంటున్న కలెక్టర్ (ఫైల్)

- ఆస్పిరేషన్ బ్లాక్ ప్రోగ్రాంలో జాతీయ స్థాయిలో 2వ ర్యాంకు
- నీతి ఆయోగ్ సంపూర్ణ అభియాన్‌కు మండలం ఎంపిక
- ఐదు విభాగాల్లో ఉత్తమ ప్రగతి
- కేంద్రం నుంచి రూ.కోటి వరకు సమకూరనున్న నిధులు

గట్టు: దేశ వ్యాప్తంగా వెనుకబడిన మండలాలను గుర్తించి, వాటి అభివృద్ధికి అన్ని శాఖల అధికారుల సమన్వయంతో ముందుకు సాగేందుకు కేంద్ర ప్రభుత్వం నీతి ఆయోగ్ ద్వారా ప్రత్యేక కార్యాచరణ ప్రణాళికను అమలు చేస్తోంది. ఇదే క్రమంలో దేశ వ్యాప్తంగా 500 మండలాలను గుర్తించి, వాటి అభివృద్ధికి పక్కా ప్రణాళిక ప్రకారం అధికారులు ముందుకు సాగుతున్నారు. ఈమేరకు ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో గట్టు, నర్వ మండలాలను కేంద్ర ప్రభుత్వం గుర్తించింది. ఈ మండలాల్లో అన్ని శాఖల అధికారులు సమన్వయం చేసుకుంటూ అభివృద్ధి చేసేందుకు ప్రత్యేక ప్రణాళికను అమలు పరుస్తున్నారు. ఇటీవల కేంద్రం ప్రకటించిన ర్యాంకుల్లో గట్టు ఆస్పిరేషన్ బ్లాక్ దేశంలోనే 5వ ర్యాంకు సొంతం చేసుకుంది. దీని ఫలితంగా నీతి ఆయోగ్ ద్వారా కేంద్రం ప్రభుత్వం గట్టు మండలానికి రూ.కోటి నజరానాను ఇవ్వనున్నట్లు కలెక్టర్ బీఎం సంతోష్ తెలిపారు.

నిత్యం సమీక్షిస్తూ.. ప్రగతి దిశగా అడుగులు

గట్టు ప్రాంతాన్ని ఆస్పిరేషన్ బ్లాక్‌గా గుర్తించి, ప్రతి మూడు మాసాలకు ఒక సారి అన్ని శాఖల అధికారులతో ప్రత్యేకంగా సమీక్ష నిర్వహిస్తూ, అభివృద్ధిపై సూచనలు చేస్తూ ముందుకు సాగుతున్నారు. 5 అంశాలపై 39 కీలక పనితీరును సూచికల ఆధారంగా నిర్ణయించారు. ఆరోగ్యం, పోషణ, విద్య, వ్యవసాయం, అనుబంధ సేవలు, ప్రాథమిక మౌలిక సదుపాయాలు, సామాజిక అభివృద్ధి అంశాలపై అధికారులు సమన్వయంతో సమీక్షలను నిర్వహిస్తూ, ఎప్పటికప్పుడు వాటి పనితీరులో ప్రగతి సాధించే దిశగా అడుగులు ముందుకు వేస్తూ సాగారు. అనుకున్నట్లే పడ్డ కష్టానికి దేశ వ్యాప్తంగా 5వ ర్యాంకును సాధించి, అందరి దృష్టి గట్టు వైపు మళ్లేలా ఇక్కడి అధికారులు, ప్రజాప్రతినిధులు కృషి చేశారు. గర్భిణులు, బాలింతలకు సరైన పౌష్టికాహారం అందించే విధంగా చర్యలు, పోషకలోపం ఉన్న వారు లేకుండా చేయడం, వైద్య సేవలను ప్రతి ఒక్కరూ వినియోగించుకునే విధంగా క్షేత్ర స్థాయిలో ఆశా వర్కర్లు, ఏఎన్‌ఎంలు కృషి చేశారు. చిన్నారులపై ప్రత్యేక శ్రద్ధ, రైతులకు కిసాన్ క్రెడిట్ కార్డులు, భూసార పరీక్షలు చేయడం, కలెక్టర్ ప్రత్యేక చొరవ కారణంగా ఈ ఏడాది 10వ తరగతి ఫలితాల్లో వందశాతం ఫలితాల సాధించగలిగాయి. అదేవిధంగా, భవిష్య భారత్ స్వచ్ఛంద సంస్థ 12 గ్రామాలను దత్తత తీసుకుని కార్యక్రమాలను అమలు చేస్తున్నారు. అంగన్‌వాడి కేంద్రాలను ఆధునికరించారు. రైతులకు చెక్ డ్యాంల నిర్మాణం, చెరువుల పునరుద్ధరణ, పశువుల పోషణ, వైద్య సేవలు, విద్యార్థులకు కంటి పరీక్షలు సేంద్రీయ వ్యవసాయంపై రైతులకు అవగాహన కార్యక్రమాలను నిర్వహించి ప్రగతిలో పాలుపంచుకున్నారు.

నిరంతర పర్యవేక్షణతోనే..



ఆస్పిరేషన్ బ్లాక్‌లో ప్రతి మూడు నెలలకు ఒక సారి సమీక్షించుకుని ముందుకు సాగడం ద్వారా అనుకున్న మేరకు లక్ష్యాన్ని చేరుకోగలిగాం. ముఖ్యంగా కలెక్టర్ ప్రతి నెలా శాఖల వారిగా ప్రగతి వివరాలను తెలుసుకుంటూ మమ్మల్ని ప్రోత్సహించారు. భవిష్యభారత్ స్వచ్ఛంద సంస్థ సహకారం ఎంతో ఉంది. మరింత బాధ్యతతో ముందుకు సాగుతాం.

– అఫ్జల్, జిల్లా నీతి ఆయోగ్ కోఆర్డినేటర్

కలెక్టర్ ఆదేశాలతోనే..



కలెక్టర్ ఆదేశాల మేరకు అన్ని శాఖల అధికారులను సమన్వయం చేసుకుంటూ ముందుకు సాగాం. అనుకున్న విధంగా ప్రగతి సాధనలో కృషి ఫలిచింది. దేశ స్థాయిలో గట్టుకు గుర్తింపు రావడం సంతోషాన్ని కల్గించింది. మరింత బాధ్యతతో ముందుకు సాగుతాం.

– చెన్నయ్య, ఎంపీడీఓ, గట్టు



ఆధునికీకరించిన అంగన్‌వాడీ కేంద్రం

దక్షిణాది రాష్ట్రాల్లో 2వ స్థానం

దేశ వ్యాప్తంగా గుర్తించబడిన వెనుకబడిన మండలాల్లో దక్షిణాది రాష్ట్రాలు తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, తమిళనాడు, కేరళ రాష్ట్రాలను కలిపి కేంద్ర ప్రభుత్వం జోన్–3గా గుర్తించింది. జోన్–3లో గట్టు అభివృద్ధి సూచికలో 2వ ర్యాంకును సాధించింది. 2024లో గట్టును ఆస్పిరేషన్ బ్లాక్‌గా గుర్తించారు. అప్పటి నుంచి అధికారులు ప్రత్యేక దృష్టిని సారించి, శాఖల వారీగా ప్రగతి సాధనకు కృషి చేశారు. గట్టు ఆస్పిరేషన్ బ్లాక్ 2025లో జనవరి నుంచి మార్చి వరకు త్రైమాసికంలో 61.24 నుంచి 69.43కు పెరిగి 8.19 శాతం వృద్ధిని సాధించినట్లు కలెక్టర్ ప్రకటించారు.

ఔత్సాహికులకు నిరుత్సాహం

ఉమ్మడి జిల్లాలో ఏర్పాటుకు నోచుకోని స్పోర్ట్స్ స్కూల్

- క్రీడా పాఠశాలలో చేరికకు చాలా మంది ఆసక్తి
- స్థానికంగా లేకపోవడంతో కొందరికే అవకాశం
- తెలంగాణ క్రీడా పాలసీలోనైనా చోటు కల్పించాలని వేడుకోలు



ఇటీవలే మహబూబ్‌నగర్‌లోని మెయిన్ స్టేడియంలో జరిగిన జిల్లాస్థాయి స్పోర్ట్స్ స్కూల్ సెలక్షన్స్ (ఫైల్)

మహబూబ్‌నగర్ క్రీడలు: స్పోర్ట్స్ స్కూళ్లు ఔత్సాహిక క్రీడాకారులకు వరంగా మారుతున్నాయి. రాష్ట్రంలో హైదరాబాద్ (హకీంపేట), కరీంనగర్, ఆదిలాబాద్‌లో క్రీడా పాఠశాలలు ఏర్పాటు చేశారు. ఈ స్కూళ్లలో 4వ తరగతిలో ప్రవేశాల కోసం రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో మొదట జిల్లాస్థాయి అనంతరం రాష్ట్రస్థాయి సెలక్షన్స్ జరుగుతాయి. రాష్ట్రస్థాయి సెలక్షన్స్‌లో ప్రతిభచాటిన విద్యార్థులు ఈ మూడు స్కూళ్లలో ప్రవేశాలు పొందుతారు. ప్రతి పాఠశాలలో 20 మంది బాలురు, 20 మంది బాలికలకు ప్రవేశాలు కల్పిస్తారు. ఇప్పటికే ఉమ్మడి జిల్లాలో జిల్లాస్థాయి సెలక్షన్స్‌కు ముగిశాయి. చిన్నారులను స్పోర్ట్స్ స్కూళ్లలో చేర్పించాలనే సంకల్పం ప్రస్తుతం చాలా మంది తల్లిదండ్రుల్లో కనిపిస్తుంది. అయితే రాష్ట్రంలో కేవలం మూడు స్పోర్ట్స్ స్కూళ్లే ఉండటంతో చాలా మంది విద్యార్థులకు అవకాశాలు దక్కడం లేదు.

క్రీడా పాలసీలోనైనా..

రాష్ట్రంలో క్రీడాభివృద్ధి, క్రీడాకారులను ప్రోత్సహించడం కోసం స్వయంగా క్రీడాకారుడైన సీఎం రేవంత్‌రెడ్డి ఆధ్వర్యంలో ప్రభుత్వం తెలంగాణ క్రీడా పాలసీ తీసుకొచ్చింది. ఇటీవలే మంత్రివర్గ సమావేశంలో నూతన క్రీడా పాలసీకి ఆమోదం తెలిపారు. ఇందులో మరిన్ని స్పోర్ట్స్ స్కూళ్లు ఏర్పాటు కోసం అవకాశం కల్పించాలని సీనియర్ క్రీడాకారులు, క్రీడాభిమానులు విజ్ఞప్తి చేస్తున్నారు.

వనపర్తిలో స్థల సేకరణ

ఉమ్మడి జిల్లాలోని మహబూబ్‌నగర్, నాగర్‌కర్నూల్ లోక్‌సభ నియోజకవర్గాల పరిధిలోనైనా రెండు స్పోర్ట్స్ స్కూళ్లు ఏర్పాటు చేయాలని పలువురు కోరుతున్నారు. ఇప్పటికే వనపర్తి జిల్లాకేంద్రంలోని మర్రికుంట సమీపంలో స్పోర్ట్స్ స్కూల్ కోసం స్థల సేకరణ చేపట్టారు. వెంటనే వనపర్తిలో స్పోర్ట్స్ స్కూల్‌ను ప్రారంభించాలని ఆ ప్రాంత క్రీడాభిమానులు ఆశాభావం వ్యక్తం చేశారు.

మెరుగైన క్రీడా వసతులు

గతేడాది రాష్ట్రంలోని మూడు స్పోర్ట్ స్కూళ్లలో ఉమ్మడి జిల్లా నుంచి 29 మంది విద్యార్థులు 4వ తరగతిలో ప్రవేశాలు పొందారు. వనపర్తితోపాటు ఉమ్మడి జిల్లాలో మరోచోట స్పోర్ట్స్ స్కూల్ ఏర్పాటైతే మరింత ఎక్కువ మంది చిన్నారులు స్పోర్ట్స్ స్కూళ్లకు ఎంపికవుతారు. స్పోర్ట్స్ స్కూళ్లలో చిన్నారులకు ఎన్నో మెరుగైన క్రీడావసతులు అందుబాటులోకి వస్తాయి. పెద్ద పెద్ద భవనాలతోపాటు ఫుట్‌బాల్, హాకీ, అథ్లెటిక్స్ ట్రాక్, బాస్కెట్‌బాల్, వాలీబాల్, కబడ్డీతోపాటు ఇతర క్రీడల కోర్టులను ఏర్పాటు చేస్తారు. తొలుత చిన్నారులకు ఫ్లెక్సిబిలిటీ తదితర అంశాల్లో పరీక్షించి వారు ఏ క్రీడల్లో రాణించే అవకాశం ఉందో అందులో ప్రత్యేక శిక్షణ ఇస్తారు. ఆయా క్రీడల్లో నిష్ణాతులైన కోచ్‌లను నియామకం చేసి చిన్నారులకు మెరుగైన క్రీడాశిక్షణ అందజేస్తాయి. అదేవిధంగా క్రీడా శిక్షణతో పాటు చదువుకూ ప్రాధాన్యం ఉంటుంది. స్పోర్ట్స్ స్కూల్ విద్యార్థులకు ఆహారపరంగా కూడా ప్రత్యేకమైన మెనూ అమలుచేస్తారు. డైటీషియన్ పర్యవేక్షణలో ప్రత్యేకమైన భోజనం అందిస్తారు. క్రీడా విద్యార్థులకు ఎలాంటి పోషక పదార్థాలు అవసరమో ముందుగానే మెనూ నిర్ణయించి దానికనుగుణంగా భోజన సౌకర్యం కల్పిస్తారు.

నైపుణ్యాలు వెలికి..



స్పోర్ట్స్ స్కూళ్లతో చిన్నారుల్లో దాగివున్న క్రీడానైపుణ్యాలను వెలికితీయవచ్చు. ప్రస్తుతం ఆయా క్రీడల్లో అంతర్జాతీయ, జాతీయ స్థాయిల్లో రాణిస్తున్న క్రీడాకారుల్లో చాలామంది స్పోర్ట్స్ స్కూల్ నుంచి వచ్చిన వారే.

– శ్రీనివాస్, డీవైఎస్‌ఓ, మహబూబ్‌నగర్

క్రీడాభివృద్ధికి కృషి..



సీఎం రేవంత్‌రెడ్డి నేతృత్వంలో రాష్ట్రంలో నూతన క్రీడా పాలసీ తీసుకురావడం సంతోషంగా ఉంది. సీఎం రాష్ట్రంలో క్రీడాభివృద్ధి కోసం ఎంతగానో కృషి చేస్తున్నారు. స్పోర్ట్స్ స్కూళ్లు చిన్నారులకు ఒక మంచి వేదికలా ఉపయోగపడుతాయి. క్రీడాపాలసీతో భవిష్యత్‌లో మనకూ స్పోర్ట్స్ స్కూల్ ఏర్పాటయ్యే అవకాశం ఉంది. – బాలరాజు, జిల్లా టేబుల్ టెన్నిస్ అసోసియేషన్ ఈసీ మెంబర్, మహబూబ్‌నగర్

విపత్తులు ఎదుర్కొనేలా ముందస్తు చర్యలు



మాట్లాడుతున్న కలెక్టర్ బీఎం సంతోష్

గద్వాల: జిల్లాలో ప్రకృతి విపత్తులు సంభవించినపుడు వాటిని సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు అన్ని శాఖలు సమన్వయంతో ముందస్తు జాగ్రత్త చర్యలు చేపట్టాలని కలెక్టర్ బీఎం సంతోష్ అధికారులను ఆదేశించారు. మంగళవారం ఐడీవోసీ కార్యాలయంలో ఎస్పీ శ్రీనివాస్‌రావుతో కలిసి సమీక్షించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ విపత్తులు సంభవించినప్పుడు ఇబ్బందులు ఎదుర్కొనే కంటే వాటిని ముందస్తు కట్టడి చర్యలు తీసుకుంటే నష్ట నివారణ చేయవచ్చన్నారు. జిల్లాలో రెండునదులైన కృష్ణా, తుంగభద్ర నదులు పారుతున్నాయని 2009లో భారీ వరద వచ్చిన సమయంలో అధికారులు సమన్వయంతో పనిచేసి ప్రాణనష్టం జరగకుండా చర్యలు తీసుకున్నారని గుర్తుచేశారు. ఈసారి జిల్లాలో మే నెల నుంచే వర్షాలు కురుస్తున్నందున అధిక వర్షాలు కురిసే అవకాశం ఉందన్నారు. విపత్తులు రాకముందే ముందస్తు చర్యలు చేపట్టాలన్నారు. జిల్లా, మండల, గ్రామ స్థాయిలలో కమిటీలు ఏర్పాటు చేసుకోవాలన్నారు. విపత్తుల నివారణ జిల్లా నోడల్ అధికారిగా అదనపు కలెక్టర్(రెవెన్యూ) నియమించినట్లు తెలిపారు. తహసీల్దార్లు మండల స్థాయిలలో సమావేశాలు నిర్వహించిన అవసరమైన నివారణ చర్యలు తీసుకోవాలన్నారు. అనంతరం ఎస్పీ శ్రీనివాస్‌రావు మాట్లాడుతూ భారీవర్షాల వల్ల శిథిలావస్థలో ఉన్న గృహాలు కూలిపోయే అవకాశమున్నందున అందుకనుగుణంగా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. రెవెన్యూ,పోలీసు, ఇరిగేషన్, ఫైర్, ఎలక్ట్రిసిటీ అధికారులు 24గంటల పాటు అప్రమత్తంగా ఉండాలన్నారు. అదనపు కలెక్టర్లు లక్ష్మీనారాయణ, నర్సింగ్‌రావు పాల్గొన్నారు.

ఉత్తమ ర్యాంకు సాధించడం అభినందనీయం

నీతిఆయోగ్ ర్యాంకింగ్‌లో దేశవ్యాప్తంగా టాప్–5లో స్థానం దక్కించుకున్న గట్టు బ్లాక్‌లో కృషి చేసిన అధికారులు అభినందనీయమని, భవిష్యత్తులో అగ్రస్థానమే లక్ష్యంగా ముందుకు సాగాలని కలెక్టర్ బీఎం సంతోష్ అన్నారు. ఐడీవోసీ కార్యాలయంలో ఈమేరకు అధికారులతో సమీక్షించారు. నీతిఆయోగ్ విడుదల చేసిన 2024–25క్యూ4 డెల్టా ర్యాంకింగ్‌లో గట్టు బ్లాక్ దేశంలో 5వ స్థానం, జోన్–3 స్థాయిలో 2వ స్థానాన్ని సాధించినట్లు తెలిపారు. ఈ విజయానికి గుర్తింపుగా గట్టు బ్లాకు నీతిఆయోగ్ నుంచి రూ.1కోటి పురస్కారం దక్కిందన్నారు. ఈవిజయంలో భాగస్వాములైన అధికారులు, విభాగధిపతులు, ఫ్రంట్‌లైన్ సిబ్బందిని ప్రత్యేకంగా అభినందించారు. అదేవిధంగా ఆరోగ్యశాఖకు సహకరిస్తున్న ఎస్‌బీఐ సంజీవని, భవిష్యభారత్, టీచ్‌ఫోర్ చేంజ్, ఎంవీ ఫౌండేషన్ వారిని అభినందించారు. అదనపు కలెక్టర్ నర్సింగ్‌రావు, డీపీఓ నాగేంద్రం, డీఎంహెచ్‌వో సిద్ధప్ప తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

అనుమానాస్పద స్థితిలో మహిళ మృతి

అయిజ: పట్టణంలోని మాలపేటకు చెందిన సరోజ(42) మంగళవారం అనుమానాస్పదంగా మృతి చెందింది. ఎస్ఐ శ్రీనివాసరావు తెలిపిన వివరాల ప్రకారం.. సరోజ మంగళవారం మధ్యాహ్నం తన నివాసంలో మంచంపై అపస్మారక స్థితిలో ఉంది. అది గమనించిన కుటుంబ సభ్యులు చికిత్స చేయించేందుకు ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. అప్పటికే ఆమె మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. మృతదేహానికి పంచనామ నిర్వహించేందుకు పోలీసులు జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు. ఆమె కొన్ని సంవత్సరాలుగా భర్తకు దూరంగా ఉంటోంది. ఆమెకు ఒక కూతురు, ఇద్దరు కుమారులు ఉన్నారు.

చెరువులో పడి వివాహిత మృతి

కేటీదొడ్డి: చెరువులో పడి ఓ మహిళ మృతిచెందిన సంఘటన మంగళవారం కేటీదొడ్డి మండలంలో చోటు చేసుకుంది. ఎస్ఐ శ్రీనివాసులు కథనం ప్రకారం.. మండలంలోని కుచినెర్ల గ్రామానికి చెందిన పద్మ(30) ఇంటి నుంచి కూలీ పనులకు వెళ్లింది. సాయంత్రం స్థానికులకు గ్రామ శివారులో చెరువుకట్ట వద్ద టిఫిన్ బాక్స్, చెప్పులు కనిపించడంతో పద్మవిగా గుర్తించి.. పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసుల సహాయంతో చెరువులో గాలింపు చేపట్టగా పద్మ మృతదేహం లభించింది. పద్మకు భర్త వీరేష్‌తోపాటు ముగ్గురు సంతానం ఉన్నారు. ఈ విషయమై పద్మ కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. అయితే కొంతకాలంగా భార్యాభర్తల మధ్య మనస్పర్థలు రావడంతో మనస్తాపం చెంది ఆత్మహత్యకు పాల్పడినట్లు గ్రామస్తులు తెలిపారు.

అనారోగ్యంతో వృద్ధుడి బలవన్మరణం

వనపర్తి రూరల్: మండలంలోని చందాపూర్‌లో చెట్టుకు ఉరేసుకొని ఓ వ్యక్తి బలవన్మరణానికి పాల్పడ్డాడు. వనపర్తి రూరల్ ఎస్ఐ జలేందర్ రెడ్డి కథనం ప్రకారం.. చందాపురం గ్రామానికి చెందిన మల్లెపోగు నాగరాజు(60) గ్రామ పంచాయతీ వర్కర్‌గా పనిచేస్తున్నాడు. అయితే కొంతకాలంగా అనారోగ్య సమస్యలతో బాధపడుతున్నాడు. ఈ క్రమంలోనే జీవితంపై విరక్తి చెందిన సోమవారం తన వ్యవసాయ పొలం దగ్గర వేప చెట్టుకు ఉరేసుకొని మృతి చెందాడు. ఈ ఘటనపై నాగరాజు కుమారుడు మధు మంగళవారం రూరల్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ తెలిపారు.

విద్యుదాఘాతానికి గొర్రెలకాపరి బలి

అలంపూర్: గొర్రెలను మేపేందుకు వెళ్లిన ఓ వ్యక్తి విద్యుత్ షాక్‌కు గురై మృతిచెందాడు. ఈ ఘటన అలంపూర్ మండలం కోనేరు గ్రామ శివారులో చోటు చేసుకుంది. స్థానికుల వివరాల మేరకు.. ఉండవెల్లి మండలం తక్కశీల గ్రామానికి చెందిన ఈశ్వర్ (33) మూడు రోజుల క్రితం కోనేరుకు చెందిన ఓ వ్యక్తి వద్ద గొర్రెల కాపరిగా పనికి కుదిరాడు. రోజు మాదిరిగానే మంగళవారం గొర్రెల మందను మేతకు తీసుకెళ్లాడు. గొర్రెలను మేపుతున్న క్రమంలో తెగిపడిన విద్యుత్ తీగలను అతడు గమనించకుండా తగలడంతో షాక్‌కు గురై అక్కడికక్కడే మృతిచెందాడు. ఈ ఘటనపై ఎస్ఐ వెంకటస్వామిని సంప్రదించగా.. విద్యుత్ షాక్‌తో వ్యక్తి మృతిచెందిన విషయం తమ దృష్టికి వచ్చిందని తెలిపారు. ఇందుకు సంబంధించి పూర్తి సమాచారం సేకరిస్తున్నట్లు పేర్కొన్నారు.

ఎంబీసీ యువతకు ఉచిత శిక్షణ

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: ఎంబీసీ నిరుద్యోగ యువతకు వివిధ నైపుణ్యాలను పెంపొందించడానికి హైదరాబాద్‌లో నాలుగు రోజుల పాటు ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు జిల్లా వెనకబడిన తరగతుల అభివృద్ధి అధికారి ఆర్.ఇందిర మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. దీని కోసం ఏదైనా డిగ్రీలో ఉత్తీర్ణులైన వారు అర్హులన్నారు. ఈ నెల 12 వరకు tgobmms.cgg.gov.in వెబ్‌సైట్‌లో నమోదు చేసుకోవాలన్నారు. అలాగే ఈ నెల 14 వరకు మహబూబ్‌నగర్ కలెక్టరేట్‌లోని తమ కార్యాలయంలో పూర్తి చేసిన దరఖాస్తులను నేరుగా అందజేయాలని సూచించారు.

చేపల వేటపై రెండు నెలల నిషేధం

అమరచింత: చేపలు సంతానోత్పత్తి చేసుకునే కాలం కావడంతో రెండు నెలల పాటు చేపల వేటపై నిషేధం విధిస్తున్నట్లు జిల్లా మత్స్యశాఖ అధికారి డాక్టర్ లక్ష్మప్ప తెలిపారు. శ్రీశైలం, జూరాల బ్యాక్ వాటర్‌లో మత్స్యసంపదపై ఆధారపడి జీవిస్తున్న మత్స్యకారులు రెండు నెలల పాటు తమ వేటను విరమించాలని కోరారు. నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

మేము చెప్పినోళ్లకే అడ్మిషన్ ఇవ్వాలి!



మరికల్ కస్తుర్బాగాంధీ బాలికల విద్యాలయం

- మరికల్ కేజీబీవీ ప్రత్యేకాధికారిణిపై రాజకీయ నాయకుల ఒత్తిడి
- ఆరో తరగతిలో ప్రవేశానికి పైరవీల జోరు
- 40 సీట్లకు 413 దరఖాస్తులు

మరికల్: ''మేము చెప్పినోళ్లకే 6వ తరగతిలో అడ్మిషన్ ఇవ్వాలి.. లేదంటే ఇక్కడి నుంచి పంపిస్తాం'' అంటూ రాజకీయ పార్టీల నాయకులు మరికల్ కేజీబీవీ ప్రత్యేకాధికారిణిపై ఒత్తిడి పెంచుతున్నారు. ఒకానొక దశలో బెదిరింపులకు పాల్పడుతున్నారు. అధికార, ప్రతిపక్ష పార్టీలకు చెందిన నాయకుల ఒత్తిళ్లతో కేజీబీవీ ఎస్ఓ, ఉపాధ్యాయులు సతమతమవుతున్నారు. ఇటీవల ఓ నాయకుడు ఎస్ఓతో దురుసుగా ప్రవర్తించడమే కాకుండా.. ఆమెతో గొడవ పడిన ఘటనను వీడియో రికార్డు చేసి ఎమ్మెల్యే, డీఈఓకు పంపిస్తానని బెదిరింపులకు గురిచేస్తున్నట్లు తెలిసింది. ఈ నేపథ్యంలో ఇక్కడ పనిచేయాలంటే భయమేస్తుందని కేజీబీవీ ఉపాధ్యాయులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.



ఓ నాయకుడి సిఫారసుతో తమ పిల్లలను చేర్చుకోవాలని ఎస్ఓపై ఒత్తిడి చేస్తున్న తల్లిదండ్రులు

ఆంగ్ల మాధ్యమం కావడంతో..

మరికల్ కేజీబీవీలో ఆంగ్ల మాధ్యమంలో బోధిస్తుండటంతో 6వ తరగతిలో ప్రవేశాలకు పోటీ పెరిగింది. మొత్తం 40 సీట్లు ఉండగా.. 413 దరఖాస్తులు వచ్చాయి. ఒక సీటుకు 10 మందికి పైగా విద్యార్థులు పోటీ పడుతున్నారు. అయితే మరికల్ మండలం నుంచే కాకుండా ఇతర మండలాల నుంచి దరఖాస్తులు వచ్చాయి. ఈ నేపథ్యంలో తాము చెప్పిన విద్యార్థినులను చేర్పించుకోవాలని రాజకీయ నాయకులు ఒత్తిడి పెంచుతున్నారు. ఒక్కో నాయకుడు 5 నుంచి 10 మంది విద్యార్థులకు అడ్మిషన్ ఇప్పించేందుకు పైరవీలు చేస్తున్నారు. కొందరు ఎమ్మెల్యే, మంత్రులచే ఫోన్లు చేయించడానికి కూడా వెనకడాటం లేదు. అంతే కాకుండా 7నుంచి 10 వరకు కూడా ఒక్కో తరగతికి 30కి పైగా దరఖాస్తులు వచ్చాయి. ఈ సీట్లకు కూడా పైరవీలు చేస్తున్నారు.

పేదలకు మొదటి ప్రాధాన్యత..

గ్రామాల నుంచి వలస వెళ్లిన వారి పిల్లలతో పాటు తల్లిదండ్రులు లేని పిల్లలు, బడిబయటి పేద బాలికలకు విద్యనందించేందుకు కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయాలను స్థాపించారు. అయితే రాజకీయ నాయకుల జోక్యంతో అర్హులైన బాలికలకు సీట్లు రావడం లేదని తెలుస్తోంది. కేజీబీవీలో తమ పిల్లలను చేర్పించేందుకు వచ్చే తల్లిదండ్రులకు సీట్లు లేవని చెబుతుండటంతో నిరాశతో వెనుదిరుగుతున్నారు.

భయపెట్టిస్తున్నారు..

> రాజకీయ పార్టీల నాయకులు తీసుకొచ్చిన విద్యార్థినులకు సీట్లు ఇవ్వకుంటే భయపెట్టిస్తున్నారు. నాతో గొడవకు దిగుతున్నారు. ఓ మహిళా అధికారిణి అని కూడా చూడకుండా గొడవ పడుతూ అగౌవర పరుస్తున్నారు. ప్రజాప్రతినిధుల, రాజకీయ నాయకుల ఒత్తిడి కారణంగా అర్హులైన పిల్లలకు న్యాయం చేయలేకపోతున్నాం.
> – రాజ్యలక్ష్మి, కేజీబీవీ ప్రత్యేకాధికారిణి, మరికల్

జూరాలకు తగ్గిన ఇన్‌ఫ్లో



జూరాల ప్రాజెక్టు వద్ద 9 క్రస్టు గేట్ల నుంచి దిగువకు విడుదలవుతున్న నీరు

- 87 వేల క్యూసెక్కుల వరద
- ప్రాజెక్టు 9 క్రస్ట్‌గేట్ల ఎత్తివేత
- కొనసాగుతున్న విద్యుదుత్పత్తి
- ప్రాజెక్టు నుంచి 92,985 క్యూసెక్కుల నీరు దిగువకు

ధరూరు/ఆత్మకూర్/దోమలపెంట: ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టుకు ఎగువ నుంచి వస్తున్న ఇన్‌ఫ్లో స్వల్పంగా తగ్గినట్లు పీజేపీ అధికారులు తెలిపారు. సోమవారం ప్రాజెక్టుకు 1.26 లక్షల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉండగా.. మంగళవారం సాయంత్రానికి 87 వేల క్యూసెక్కులకు తగ్గింది. దీంతో ప్రాజెక్టు 9 క్రస్ట్ గ్రేట్లను ఎత్తి 60,075 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. జల విద్యుత్ కేంద్రంలో 5 యూనిట్లలో విద్యుదుత్పత్తి కొనసాగుతోంది. విద్యుదుత్పత్తి కోసం 30,722 క్యూసెక్కులు, కోయిల్‌సాగర్‌కు 315 క్యూసెక్కులు, భీమా లిఫ్టు-1కు 650 క్యూసెక్కులు, ఆవిరి రూపంలో 43 క్యూసెక్కులు, ఎడమ కాలువకు 550 క్యూసెక్కులు, కుడి కాలువకు 280 క్యూసెక్కులు, ఆర్‌డీఎస్ లింక్ కెనాల్‌కు 150 క్యూసెక్కులు కలిసి ప్రాజెక్టు నుంచి మొత్తం 92,985 క్యూసెక్కుల నీటిని దిగువన శ్రీశైలం ప్రాజెక్టుకు విడుదల చేస్తున్నారు. ప్రాజెక్టు పూర్తి స్థాయి నీటి మట్టం 9.657 టీఎంసీలు కాగా.. ప్రస్తుతం ప్రాజెక్టులో 7.590 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు పీజేపీ అధికారులు వెల్లడించారు.

కొనసాగుతున్న విద్యుదుత్పత్తి

దిగువ, ఎగువ జూరాల జలవిద్యుదుత్పత్తి కేంద్రాల్లో మంగళవారం 11 యూనిట్ల ద్వారా విద్యుదుత్పత్తి చేపట్టినట్లు ఎస్ఈ శ్రీధర్ తెలిపారు. ఎగువలో 5 యూనిట్ల ద్వారా 195 మెగావాట్లు, దిగువన 6 యూనిట్ల ద్వారా 240 మెగావాట్లు కలిపి మొత్తం 435 మెగావాట్ల విద్యుదుత్పత్తి చేపట్టామన్నారు.

శ్రీశైలానికి కొనసాగుతున్న వరద

శ్రీశైలం జలాశయంలో మంగళవారం 874.8 నీటిమట్టం వద్ద 162.4372 టీఎంసీలుగా ఉంది. జూరాలలో ఆనకట్ట గేట్లు ఎత్తి స్పిల్‌వే ద్వారా 60,075 క్యూసెక్కులు, విద్యుదుత్పత్తి చేస్తూ 30,722 మొత్తం 90,797 క్యూసెక్కుల నీటి ప్రవాహం శ్రీశైలం వస్తున్నాయి. శ్రీశైలం కుడి, ఎడమ విద్యుత్ కేంద్రాల్లో విద్యుదుత్పత్తి చేస్తూ 58,750 క్యూసెక్కుల నీటిని దిగువన సాగర్‌కు విడుదల చేస్తున్నారు. ఇరవై నాలుగు గంటల వ్యవధిలో భూగర్భ కేంద్రంలో 9.504 మిలియన్ యూనిట్ల విద్యుత్పత్తి చేసి 19,081 క్యూసెక్కులు, ఏపీ జెన్కో పరిధిలోని కుడిగట్టు కేంద్రంలో 6.068 మి.యూనిట్లు ఉత్పత్తి చేసి 11,061 క్యూసెక్కుల నీటిని సాగర్‌కు విడుదల చేశారు.

కోయిల్‌సాగర్ నీటిమట్టం 21 అడుగులు

దేవరకద్ర: కోయిల్‌సాగర్ నీటిమట్టం మంగళవారం సాయంత్రం వరకు 21 అడుగులకు చేరింది. జూన్ 1న 11 అడుగులుగా ఉన్న నీటి మట్టం 40 అడుగుల మేర పెరిగింది. జూన్ 6న తీలేరు వద్ద ఉన్న ఫేస్ టు పంప్‌హౌస్ నుంచి ఒక పంపును ప్రారంభించి నీటిని కోయిల్‌సాగర్‌కు వదిలారు. ఒక పంపు ద్వారా 315 క్యూసెక్కుల నీరు ప్రాజెక్టులోకి చేరుతుంది.



పాలమూరుకు మూడోస్థానం

నిజామాబాద్‌లో మంగళవారం ముగిసిన రాష్ట్రస్థాయి జూనియర్ బాలుర ఫుట్‌బాల్ చాంపియన్‌షిప్‌లో మహబూబ్‌నగర్ బాలుర జట్టు మెరుగైన ప్రతిభ కనబరిచి మూడో స్థానంలో నిలిచింది. ఈసందర్భంగా జిల్లా ఫుట్‌బాల్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు ఎన్‌పీ వెంకటేశ్, భానుకిరణ్ జట్టు సభ్యులకు అభినందనలు తెలిపారు.

– మహబూబ్‌నగర్ క్రీడలు

'దళితుల భూములు లాక్కొని మొక్కలు నాటారు'



మహబూబ్‌నగర్ రూరల్: మహబూబ్‌నగర్ అర్బన్ మండలంలోని ఏనుగొండ రెవెన్యూ శివారులో గల దళితుల భూములను ఫారెస్టు అధికారులు బలవంతంగా లాక్కొని మొక్కలు నాటారని ఆరోపిస్తూ ఎమ్మార్పీఎస్ (టీఎస్) దక్షిణ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు మల్లెపోగు శ్రీనివాస్ బాధిత రైతులతో కలిసి మంగళవారం కలెక్టర్ విజయేందిర బోయికి ఫిర్యాదు చేశారు. 431 సర్వే నంబర్‌లో 20 ఎకరాలకు పైగా భూమిని, 435 సర్వే నంబర్‌లో 6.37 ఎకరాల భూమిని ఫారెస్టు అధికారులు తమ స్వాధీనంలోకి తీసుకున్నారని వాపోయారు. దీంతో ఆ భూముల యజమానులైన దళితులు పూర్తిగా జీవనోపాధి కోల్పోయారని కలెక్టర్‌కు విన్నవించారు. సానుకూలంగా స్పందించిన కలెక్టర్ విచారణ చేసి, తగిన చర్యలు తీసుకుంటానని బాధిత రైతులకు హామీ ఇచ్చారు.

ఇసుక తరలింపుపై అన్నదాతల ఆగ్రహం



మాగనూర్: మండల కేంద్రంలో ఇసుక తరలింపుపై ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇసుక తరలింపుపై గొడవలు చెలరేగడంతో తహసీల్దార్ మంగళవారం గ్రామస్తులతో చర్చించారు. మాగనూర్ సమీపంలో కాకుండా మరెక్కడైనా ఇసుక తీసుకోవాలని తేల్చి చెప్పడంతో తహసీల్దార్ అందుకు అంగీకరించారు. ఈ క్రమంలో సదరు కొండగల్, నారాయణపేట కాంట్రాక్టర్లు ఆర్డీఓ రాంచదర్‌తో కలిసి ఇసుక తరలింపునకు ప్రయత్నాలు మొదలు పెట్టారు. దీంతో సమాచారం తెలుసుకున్న గ్రామస్తులు పెద్ద సంఖ్యలో వాగు దగ్గరకు చేరుకొని నిరసన వ్యక్తం చేశారు. ఇసుక తరలించడం ద్వారా గ్రామానికి తీవ్ర నీటి ఎద్దడి ఏర్పడడంతో పాటు సమీపంలోని వందలాది ఎకరాలు బీడు భూములుగా మారుతాయని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రంలోని ఓ శాఖకు చెందిన ప్రముఖ మంత్రి ప్రోద్బలంతోనే అధికారులు ఇంతలా అత్యుత్సాహం చూయిస్తున్నారని మండిపడ్డారు. స్పందించిన ఆర్డీఓ రాంచందర్ ప్రజలు ప్రభుత్వం చేపట్టే అభివృద్ధి పనులకు సహకరించాలని, మాగనూర్ గ్రామ సమీపంలోని ఇసుక కేవలం ఒక మీటర్ లోతు మాత్రమే తరలిస్తామని సర్దిచెప్పి పంపించారు. కార్యక్రమంలో తహసీల్దార్ నాగలక్ష్మి, మైనింగ్ ఆర్ఐ ప్రతాప్‌రెడ్డి, డీటీ సురేశ్‌కుమార్, ఇరిగేషన్ ఎస్సీ శ్రీధర్, భూగర్భ జలాల అధికారి నరేష్, సిబ్బంది పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయిలో విజేతగా నిలవాలి



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న ఎన్పీ వెంకటేశ్

ఉమ్మడి జిల్లా ఒలింపిక్ సంఘం అధ్యక్షుడు ఎన్పీ వెంకటేశ్

మహబూబ్‌నగర్ క్రీడలు: రాష్ట్ర స్థాయి ఫుట్‌బాల్ టోర్నీలో జిల్లా జట్టు మెరుగైన ప్రతిభ కనబరిచి విజేతగా నిలవాలని ఉమ్మడి జిల్లా ఒలింపిక్ సంఘం అధ్యక్షులు, జిల్లా ఫుట్‌బాల్ అసోసియేషన్ అధ్యక్షులు ఎన్‌పీ వెంకటేశ్ అన్నారు. మంచిర్యాల జిల్లా రామకృష్ణాపూర్‌లో ఈనెల 9 నుంచి 12వ తేదీ వరకు జరిగే రాష్ట్రస్థాయి బాలికల జూనియర్ ఫుట్‌బాల్ టోర్నీలో పాల్గొనే జిల్లా జట్టు ఎంపికలను మంగళవారం జిల్లా కేంద్రంలోని మెయిన్ స్టేడియంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన క్రీడాకారిణులను పరిచయం చేసుకొని మాట్లాడుతూ ఫుట్‌బాల్‌లో జిల్లా క్రీడాకారులు జాతీయ, అంతర్జాతీయ స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. నిరంతర ప్రాక్టీస్ చేయడం వల్ల క్రీడల్లో ఉన్నతస్థానాల్లో చేరుకోవచ్చని అన్నారు. కార్యక్రమంలో జిల్లా యువజన, క్రీడల అధికారి ఎస్.శ్రీనివాస్, జిల్లా ఫుట్‌బాల్ అసోసియేషన్ ప్యాట్రన్ రంగారావు, ఉపాధ్యక్షులు రమేష్‌కుమార్, ప్రధాన కార్యదర్శి భానుకిరణ్, కోశాధికారి కేఎస్.నాగేశ్వర్, కార్యనిర్వాహక కార్యదర్శి ఇమ్మాన్యుయెల్ జేమ్స్, కోచ్ వెంకట్రాములు, ఖేలో ఇండియా ఫుట్‌బాల్ కోచ్ నికేష్ పాల్గొన్నారు.

ఆర్టీసీ కార్మికుల డిమాండ్లు పరిష్కరించాలి



సమావేశంలో మాట్లాడుతున్న టీఎంయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అశ్వత్థామారెడ్డి

టీఎంయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అశ్వత్థామారెడ్డి

స్టేషన్ మహబూబ్‌నగర్: ఆర్టీసీ కార్మికుల న్యాయమైన డిమాండ్లను వెంటనే పరిష్కరించాలని తెలంగాణ మజ్దూర్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అశ్వత్థామారెడ్డి అన్నారు. జిల్లా కేంద్రంలోని ఓ కన్వెన్షన్ హాల్లో మంగళవారం టీఎంయూ ఆధ్వర్యంలో ఆర్టీసీ ఉద్యోగుల ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న అశ్వత్థామారెడ్డి మాట్లాడుతూ గత బీఆర్ఎస్ ప్రభుత్వం కొత్త బస్సులను కొనుగోలు చేయక ఆర్టీసీని నిర్వీర్యం చేసిందని ఆరోపించారు. ఎన్నికల్లో బీఆర్ఎస్‌ను ఓడగొట్టి కాంగ్రెస్‌ను గెలిపించడానికి ఆర్టీసీ ఉద్యోగులు వెన్నంటి ఉన్నారని గుర్తుచేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఆర్టీసీ ఉద్యోగుల సంక్షేమానికి ఎన్నికల మేనిఫెస్టోలో పేర్కొన్న అంశాల్లో 90 శాతం కూడా నెరవేర్చలేదన్నారు. గతం కంటే దారుణంగా ఆర్టీసీ కార్మికుల సమస్యలున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేయాలని, రెండు పేస్కేల్ చెల్లించాలని, చనిపోయిన ఉద్యోగులకు సంబంధించి వారి పిల్లలకు శాశ్వత పద్ధతిన ఉద్యోగాలు కల్పించాలని డిమాండ్ చేశారు. ఆర్టీసీలో సమ్మె అనివార్య పరిస్థితికి తీసుకురావద్దని కోరారు. ఒకవేళ సమ్మె వస్తే దానికి బాధ్యత రాష్ట్ర ప్రభుత్వం, యాజమాన్యమే బాధ్యత తీసుకోవాలని కోరారు. సమావేశంలో టీఎంయూ రాష్ట్ర అధ్యక్షులు ఎం.శంకర్, కోశాధికారి రాజలింగం, రాష్ట్ర కార్యదర్శులు యాదయ్య, నిరంజన్, సత్యనారాయణ, బీఎస్.రెడ్డి, ఎండీ.వహీద్, నాగయ్య, రాష్ట్ర ప్రచార కార్యదర్శి వీసీఎస్‌రెడ్డి, నల్గొండ జిల్లా కార్యదర్శి శ్రీనివాసులు, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు కె.రవీందర్‌రెడ్డి, డీఎస్‌చారి, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ వెంకటయ్య, ప్రచార కార్యదర్శి భానుప్రకాశ్‌రెడ్డి తోపాటు రీజియన్‌లో ఆయా డిపోల అధ్యక్ష, కార్యదర్శులు, సభ్యులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

భూగర్భ కేంద్రాన్ని సందర్శించిన హైడెల్ డైరెక్టర్




భూగర్భ కేంద్రంలో హైడెల్ డైరెక్టర్ బాలరాజును సత్కరిస్తున్న ఇంజినీర్లు

దోమలపెంట: టీఎస్ జెన్‌కో హైడెల్ డైరెక్టర్ బాలరాజు మంగళవారం శ్రీశైలం భూగర్భ జలవిద్యుత్ కేంద్రాన్ని సందర్శించారు. ఇటీవల ఆయన జెన్‌కో హైడెల్ డైరెక్టర్‌గా నియమితులయ్యారు. ఆయనకు కేంద్రం సీఈ కేవీవీ సత్యనారాయణ, ఎస్ఈ(ఓఅండ్ఎం) ఆదినారాయణ, ఎస్ఈ(సివిల్) రవీంద్రకుమార్ స్వాగతం పలికారు. ఈ సందర్భంగా హైడెల్ డైరెక్టర్ మొదట కేంద్రం మొత్తం తిరిగి అన్ని యూనిట్లను పరిశీలించారు. నాలుగో యూనిట్‌కు సంబంధించి చేపడుతున్న పునరుద్ధరణ పనులను పరిశీలించి ఇంజినీర్లు, సాంకేతిక సిబ్బందికి సూచనలు తెలిపారు. అనంతరం కేంద్రంలోని కాన్ఫరెన్స్ హాల్‌లో ఇంజినీర్లతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా టీజీ స్టేట్ పవర్ ఇంజినీర్స్ అసోసియేషన్, టీజీ స్టేట్ అసిస్టెంట్ ఇంజినీర్స్ అసోసియేషన్ బ్రాంచ్ కార్యదర్శులు మదన్‌మోహన్‌రెడ్డి, చరణ్ ఆధ్వర్యంలో ఇంజినీర్లు వినతిపత్రం అందజేశారు. ప్రధానంగా కోవిడ్ 2020 నుంచి జెన్‌కోలో బదిలీలు కొంతవరకే జరుగుతున్నాయన్నారు. మారుమూల ప్రాంతాల్లోని విద్యుత్తు ఉత్పత్తి స్టేషన్లలో విధులు నిర్వహిస్తున్న ఇంజినీర్లు పదేండ్లుగా బదిలీలుకాక కుటుంబాలకు దూరంగా ఉండాల్సి రావడంతో మానసికంగా వ్యథ చెందుతున్నారని వాపోయారు. కనీసం ఆరోగ్యరీత్యా ఇబ్బందులు పడుతున్న వారు, భార్యాపిల్లలకు దూరంగా, వ్యక్తిగత ఇబ్బందుల్లో ఉంటున్న ఇంజినీర్లను గుర్తించి వారికి బదిలీల్లో ప్రాధాన్యం ఇవ్వాలని, బదిలీలు త్వరితగతిని చేపట్టాలని విన్నవించుకున్నారు. సమస్య పరిష్కారానికి సీఎండీ దృష్టికి తీసుకెళ్తానని హైడెల్ డైరెక్టర్ తెలిపినట్లు ఇంజినీర్లు చెప్పారు. అంతకుముందు ఇంజినీర్ల సంఘం నాయకులు, ఇంజినీర్లు హైడెల్ డైరెక్టర్‌ను శాలువాతో సన్మానించారు.

హైదరాబాద్‌లో 'ఖిల్లా' వాసి అనుమానాస్పద మృతి

మృతదేహాన్ని తండాకు తీసుకురాగా.. తిప్పి పంపిన పోలీసులు



కోతులకుంటతండాలో హన్మంత్ మృతదేహాన్ని అంబులెన్సులో తిరిగి పంపుతున్న పోలీసులు



హన్మంత్(ఫైల్)

ఖిల్లాఘనపురం: హైదరాబాద్‌లో ఖిల్లాఘనపురం మండల కోతులకుంట తండాకు చెందిన వ్యక్తి అనుమానాస్పద స్థితిలో మృతిచెందాడు. కుటుంబ సభ్యుల కథనం ప్రకారం.. కోతులకుంట తండాకు చెందిన కేతావత్ హన్మంతు(38) తనభార్య జమున కుమారుడు రవితో పాటు హైదరాబాద్‌లోని గోపన్‌పల్లిలో ఉంటున్నారు. మంగళవారం ఉదయం హన్మంత్ తను నివాసం ఉంటున్న ప్రాంతానికి సమీపంలో గొంతు తెగి రక్తపు మడుగులో పడి మృతి చెందాడు. కుటుంబ సభ్యులు గమనించి అప్పులు ఎక్కువై ఆవేదనతో ఆత్మహత్య చేసుకున్నాడని చెప్పి మృతదేహాన్ని అక్కడి నుంచి సొంత గ్రామ మైన కోతులకుంట తండాకు సాయంత్రం తీసుకొచ్చారు. ఇదిలా ఉండగా గోపన్‌పల్లి ప్రాంతానికి చెందిన పోలీసులు ఖిల్లాఘనపురం పోలీసులకు సమాచారం ఇవ్వడంతో కొత్తకోట సీఐ రాంబాబు పర్యవేక్షణలో మండల ఇన్‌చార్జ్ ఎస్ఐ జయన్న సిబ్బందితో తండాకు చేరుకున్నారు. మృతదేహాన్ని వచ్చిన అంబులెన్సులోనే తిరిగి హైదరాబాద్‌కు పంపించారు. మృతదేహం మెడకు కత్తిగాట్లు ఉండటంతోపాటు హన్మంతు మృతికి సంబంధించిన ఫొటోలు సోషల్‌మీడియాలో హల్‌చేయడంతో పోలీసులు అప్రమత్తమైనట్లు తండావాసులు చర్చించుకుంటున్నారు. మృతికి కారణం ఏమై ఉంటుందని వారు ప్రశ్నించుకుంటున్నారు.

ఆర్టీసీ బస్సును ఢీకొన్న ప్రైవేట్ ట్రావెల్స్

ముగ్గురికి గాయాలు

కొత్తకోట రూరల్: ఆర్టీసీ బస్సును ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు ఢీకొనడంతో బస్సు డ్రైవర్లతోపాటు ఓ ప్రయాణికురాలికి గాయాలయ్యాయి. మంగళవారం తెల్లవారుజామున వనపర్తి జిల్లా కొత్తకోట బైపాస్ సమీపంలో ఎన్‌హెచ్-44పై చోటుచేసుకున్న ఈ ఘటనకు సంబంధించి ఎస్ఐ ఆనంద్ తెలిపిన వివరాలిలా.. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం అన్నమయ్య జిల్లా మదనపల్లి డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు సోమవారం సాయంత్రం 5 గంటలకు హైదరాబాద్ బీహెచ్‌ఈఎల్‌కు ప్రయాణికులతో బయలుదేరింది. మంగళవారం తెల్లవారుజామున కొత్తకోట సమీపంలో మదర్ థెరిస్సా జంక్షన్ సమీపంలోకి రాగానే హైదరాబాద్ నుంచి తిరుపతి వెళ్తున్న ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు డ్రైవర్ అజాగ్రత్త కారణంగా డివైడర్‌ను ఢీకొని రోడ్డు దాటి వచ్చి ఆర్టీసీ బస్సును ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఆర్టీసీ బస్సు డ్రైవర్ సుధాకర్‌తోపాటు మరో డ్రైవర్ మడెం నాగరాజు, ప్రయాణికురాలు పావనికి గాయాలయ్యాయి. ఈ ప్రమాదంలో రెండు బస్సుల ముందు భాగాలు ధ్వంసమయ్యాయి. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని క్షతగాత్రులను 108లో వనపర్తి జనరల్ ఆస్పత్రికి తరలించారు. ఆర్టీసీ బస్సు డ్రైవర్ సుధాకర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు శంకర్ రెడ్డిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.



ప్రమాదంలో దెబ్బతిన్న ఆర్టీసీ బస్సు, ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు